క్లుప్తంగా

ముస్లింల ప్రేమాభిమానాలు మరువలేనివి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ముస్లింలు

ఖమ్మంరూరల్: ముస్లింల ప్రేమాభిమానాలు ఎన్నటికీ మరువలేనివని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ముస్లింలు ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొంగులేటిని కలిసిన సందర్భంగా మాట్లాడారు. మండలంలో షాదీఖానా, మసీదుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తానని, త్వరలో వచ్చి ఇఫ్తార్‌లో పాల్గొంటానని చెప్పారు. అనంతరం ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఎండీ.గౌస్‌పాషా, షేక్.నజీరుద్దీన్, మెయిస్, ఖలీల్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పండితాపురం సంత వేలం

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి (పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జీపీ ప్రత్యేకాధికారి,ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. సోమవారం సంత ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహించనుండగా.. ఆసక్తిగలవారు సకాలంలో హాజరుకావాలన్నారు.

నేడు కేఎంసీ గ్రీవెన్స్ రద్దు

ఖమ్మంమయూరిసెంటర్: నేడు ఖమ్మం నగర పాలక సంస్థలో జరగనున్న గ్రీవెన్స్ (ప్రజావాణి)ని రద్దు చేసినట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పన్నుల వసూళ్లు, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల వసూళ్లపై నిమగ్నమయ్యారని, ఈ సోమవారం ప్రజలకు అందుబాటులో ఉండక పోవడంతో గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

విద్యార్థినికి సైకిల్ వితరణ

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం 39వ డివిజన్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని ఊరుకొండ చంద్రికకు ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్ సహకారంతో ఆ డివిజన్ కార్పొరేటర్ మడూరి ప్రసాద్‌రావు ఆదివారం సైకిల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి, కవిత, సరిత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్..

ఖమ్మం మామిళ్లగూడెం: వ్యాపారవేత్త, సామాజిక సేవకులు బొమ్మ దుర్గా నాగేశ్వరరావు తనయుడు బొమ్మ ప్రసాద్ ద్వితీయ వర్థంతిని పురస్కరించుకుని నగరంలోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలకు సుమారు ర.10వేలు విలువైన మైక్ సెట్‌ను ఆ పాఠశాల హెచ్ఎం కట్ట వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భ్రమరాంబ, రాంబాబు, సీత, సుకన్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్లేడులో క్రికెట్ టోర్నీ

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో మొదటి నాలుగు బహుమతులు రూ.లక్ష, రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలతో పాటు షీల్డ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 96664 99083, 95054 05605, 99595 93968, 63008 23789 నంబర్లను సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

ప్రశాంతంగా 'ఏకలవ్య' ప్రవేశ పరీక్ష

రఘునాథపాలెం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరవ తరగతి సీట్ల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం రఘునాథపాలెంలో ప్రశాంతంగా జరిగింది. రఘునాథపాలెంలోని కేసీఆర్ కాలనీ గిరిజన ప్రతిభా పాఠశాలలో ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షలో మొత్తం 505 మంది విద్యార్థులకు గాను 472 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి తెలిపారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షకు అనుమతించగా.. పర్యవేక్షకుడు వీర్యా నాయక్ పరీక్ష తీరును పరిశీలించారు.

ఇఫ్తార్ విందులో 'రాయల'

కూసుమంచి: కూసుమంచికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మద్ అలీ ఆదివారం రాత్రి తన నివాసంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లతో పాటు తుంబూరు దయాకర్‌రెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరై రంజాన్ పవిత్రను వివరించి ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురుర కాంగ్రెస్ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

విలీనం.. బలహీనం!

విలీన పంచాయతీల్లో తాండవిస్తున్న సమస్యలు

- డ్రెయినేజీ వ్యవస్థ లేక అవస్థలు
- అలంకారప్రాయంగా నల్లా కనెక్షన్లు
- కరువైన పారిశుద్ధ్య పర్యవేక్షణ
- దశాబ్ద కాలంగా కనిపించని పురోగతి

మున్సిపాలిటీల్లో విలీనమైతే అభివృద్ధితో పాటు అన్ని సౌకర్యాలు అందుతాయని భావించిన పంచాయతీల ప్రజలకు భంగపాటే ఎదురైంది. దశబ్ద కాలంగా కనీస సౌకర్యాలు అందడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో నివసిస్తున్నామన్న భావన తమలో కలగడం లేదని వాపోతున్నారు. పంచాయతీలుగా ఉన్నప్పుడు కనీసం బావుల ద్వారా అయినా మంచినీరు వచ్చేదని, ఇప్పుడు నల్లా కనెక్షన్లు ఉన్నా నీరు మాత్రం రావడం లేదంటున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గొల్లగూడెం, అల్లీపురం, కొత్తగూడెం పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యాన క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టగా.. ఆయా గ్రామస్తులు తమ గోడు వెలిబుచ్చారు. – ఖమ్మంమయూరిసెంటర్

కనిపించని డ్రెయినేజీలు..



అల్లీపురంలో కచ్చా కాల్వలో నిలిచిన మురుగు

ఖమ్మం కార్పొరేషన్‌గా ఏర్పడే సమయాన నగరం చుట్టుపక్కల పంచాయతీలను విలీనం చేశారు. విలీనం చేసి దశాబ్ద కాలం దాటినా.. అప్పటి సమస్యలే.. ఇప్పటికీ తాండవిస్తున్నాయి. పంచాయతీలుగా ఉన్న సమయాన నిర్మించిన చిన్న చిన్న డ్రెయినేజీలే ఇప్పటికీ దర్శనం ఇస్తున్నాయి. ఎక్కడా నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలు కనిపించడం లేదు. ఏ చిన్న పాటి వర్షం వచ్చినా డ్రెయినేజీలు పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. ఇతర ప్రాంతాల్లో పాలకులు వందల కోట్ల రూపాయలతో డ్రెయినేజీల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తున్నారే తప్పా ఈ పంచాయతీలను పట్టించుకోకపోవడం శోచనీయం. ఇకనైనా డ్రెయినేజీలు నిర్మించాలని పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు పేర్కొంటున్నారు.

రోడ్ల వెంట పెంట దిబ్బలు..



కొత్తగూడెంలోని పశువుల ఆస్పత్రి పక్కన పెంటదిబ్బ

విలీన పంచాయతీల్లో గేదెల పెంపకం ఉండడంతో స్థానికులు వాటి నుంచి వచ్చే గడ్డి, పెంట వ్యర్థాలను రోడ్ల వెంటే వేస్తున్నారు. ఈ వ్యర్థాలకు ప్రత్యేక డంపింగ్ లేకపోవడంతో రోడ్ల వెంట వేస్తుండగా.. విలీన గ్రామాల్లో కొంత అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. వర్షాకాలం సమయాన రోడ్లన్నీ పెంటతో నిండి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈవ్యర్థాలను సేకరించి సేంద్రియ ఎరువుల తయారీకి తరలించాలని చెబుతున్నారు.



కొత్తగూడెంలో అపరిశుభ్రంగా ఉన్న ఓ వీధి

పేరుకే నల్లా కనెక్షన్..



గొల్లగూడెం మాలపల్లి కాలనీలో పైపు లైన్లు

ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసి తాగునీటిని అందించేందుకు అమృత్ స్కీమ్‌ను అమలు చేసింది. ఇందులో భాగంగా విలీన పంచాయతీల్లోనూ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. కానీ వాటి నుంచి నీరు సరఫరా కాక అలంకారప్రాయంగా మిగిలాయి. తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు.

సాక్షి ఫోకస్

నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం ప్రాంతం మాలపల్లి (సారాతోట) కాలనీలో సుమారు 30 నుంచి 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరికి రెండేళ్ల క్రితమే మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇచ్చి వాటికి మీటర్లు ఏర్పాటు చేశారు. అయితే కనెక్షన్ ఇచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు చుక్క నీరు కూడా రాలేదని స్థానికులు వాపోతున్నారు. ఇక ఇతర అవసరాల కోసం గతంలో వేసిన నల్లాలనే వినియోగిస్తున్నామని, అవి రాకపోతే డబ్బులు వెచ్చించి బయట నుంచి నీటిని తెప్పించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఇక వేసవి కాలంలో ఇతర అవసరాల కోసం కూడా నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్పొరేషన్ అధికారులు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



విలీన పంచాయతీల్లో డ్రెయినేజీల సమస్య పరిష్కరించేందుకు పరిశీలిస్తున్నాం. వీటి కోసం రూ.150 కోట్లు అవసరం ఉంటుండగా.. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే విలీన గ్రామపంచాయతీల్లో పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా చేస్తాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడతాం.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్

ఇబ్బంది పడుతున్నాం..



మంచినీటి సరఫరా కోసం మా ప్రాంతంలోని అన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు నీరు సరఫరా కాలేదు. మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోజూ కూలికి వెళ్లే వారు మంచినీటిని కొనుగోలు చేసి తాగాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మా కాలనీకి మంచినీటి సరఫరా చేయాలి.

– ఎస్‌కె.మస్తాన్, మాలపల్లి కాలనీ, గొల్లగూడెం

పన్నుల వసూళ్లపై ఏఎంసీ సమీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పన్నుల వసూళ్లపై కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా ఆర్ఓ జి.శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం కేఎంసీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఇప్పటి వరకు రోజువారీగా, రెవెన్యూ వార్డుల వారీగా ఎంత మేర పన్నులు వసూలు చేస్తున్నారని ఒక్కో బిల్లు కలెక్టర్ నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా షఫీ ఉల్లా మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 15 రోజులు గడువు మాత్రమే ఉన్నందున ప్రణాళిక ప్రకారం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఎవరైనా పన్నులు చెల్లించకపోతే వడ్డీల భారం పెరుగుతుందని ఇంటింటికి వెళ్లి వివరించి సకాలంలో పన్నులు చెల్లించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మొండి బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు ఇవ్వడంతో పాటు



సమీక్షిస్తున్న ఏఎంసీ అహ్మద్ షఫీఉల్లా

వారం రోజుల్లో వారిపై చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. పన్నుల వసూళ్లల్లో ఎవరైన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని, నూరు శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఆర్ఐలు, బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

పేదలందరికీ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: జాతీయ ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకండ కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో పగిడిపల్లి ఏసు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 రోజుల పని ప్రాతిపదికన ఇందిరమ్మ భరోసాకు లబ్ధిదారులను ఎంపిక చేయడంపై పునరాలోచన చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర పూరిత వైఖరిని అవలంభిస్తుందని, బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గించడంతో పాటు జరిపిన కేటాయింపులను కూడా ఖర్చు చేయడం లేదన్నారు. రైతు భరోసా మాదిరి కూలీ భరోసా పథకాన్ని కూడా ప్రవేశపెట్టి ఆర్థిక చేయూత నివ్వాలని కోరారు. రేషన్ కార్డులు ఇవ్వాలని ఇందుకు త్వరలోనే సంఘం ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు దండు ఆదినారాయణ, అయోధ్య, రామలక్ష్మి, కంపసాటి వెంకన్న, బానోత్ రామ్మూర్తి, బత్తిన సీతారాములు, మేళ్లచెరువు వీరబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం కోసం పోరాడండి



సదస్సులో మాట్లాడుతున్న రామచందర్

ఖమ్మం మామిళ్లగూడెం: సమసమాజ స్థాపనలో భాగంగా ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ రామచందర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ 10వ స్టడీ సర్కిల్‌లో 'సోషలిస్టు విప్లవమా? నూతన ప్రజాస్వామ్యక విప్లమా?'అనే అంశంపై ఆయన బోధించారు. భారతదేశ అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారి దేశమని, ఈ దేశంలో బూర్జువా ప్రజాస్వామ్యం కూడా ప్రజలకు అందట్లేదన్నారు. ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనాలు, మహిళలపై పీడన, అందరికీ సమానమైన రాజకీయ హక్కులు తదితర అంశాలు ప్రజలందరికీ అందడం లేదని ఆరోపించారు. అమెరికా ట్రంప్ హెచ్చరికలతో ప్రధాని మోదీ అమెరికా అనుకూల విధానాలను బాహాటంగా చేస్తుండడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో అన్ని వర్గాల అవసరాలకు అనుగుణంగా ప్రవేశపెట్టాలని కోరారు. కన్వీనర్ రాయల రవికుమార్ అధ్యక్షత జరిగిన ఈ సదస్సులో కొల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, గుర్రం అచ్చయ్య, ఆవుల అశోక్, సీఐ పుల్లయ్య, బందెల వెంకయ్య, శిరోమణి, మనోహర్‌రాజ్, భాస్కరాచారి, నారాయణ, విజయ్, శోభ, ఆజాద్, వెంకటేష్, చందు, వై.కృష్ణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శ కమ్యూనిస్టు 'కొండపల్లి'

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కొండపల్లి లక్ష్మీనర్సింహారావు(కేఎల్) ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం సుందరయ్య భవనంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి ఆర్.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కేఎల్ వర్ధంతి సభలో నివాళులర్పించాక మాట్లాడారు. పార్టీ రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు వై.శ్రీనివాసరావు, రమేష్, వీరభద్రం, నాగేశ్వరరావు, వీరబాబు, జె.వెంకన్నబాబు, ప్రవీణ్, వినోద్, భిక్షం పాల్గొన్నారు.

నివాళి ..

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మేడ్చల్ జిల్లా పోలీస్ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్, డీఎస్పీ జవహర్‌లాల్ కర్స, సంతాప సభలో పలువురు సంతాపం ప్రకటించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి వైరా మాజీ శాసనసభ్యులు మదన్‌లాల్, ఎఫ్‌సీఐ మేనేజర్ సుందర్‌లాల్‌తో పాటు భూక్యా ఉపేంద్రబాయి, బానోతు భద్రూనాయక్, రవీంద్రనాయక్, స్పందన, త్రివేణి, లక్ష్మిలు హాజరై నివాళులర్పించారు.

జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 28న సమస్యలపై నిర్వహించే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేష్ కోరారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీ నియమించి, వ్యవసాయ అధికారుల అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్యా పంతులు, కార్యదర్శి గూగులోతు కృష్ణ, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ నాగేశ్వర్, జిల్లా నాయకులు బానోతు నందు, సాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ప్రతిష్ఠ వేడుకలో పాల్గొన్న ప్రముఖులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్ ఎన్‌టీఆర్ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్త్రా (అయ్యప్ప స్వామి) దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆదివారం కేరళ పూజారుల భక్త నామ కీర్తనలో వైభవంగా ప్రతిష్ఠించారు. ఉదయం మహాగణపతి హోమం, అంకురపూజ, అయ్యప్ప స్వామి, నాగరాజస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మాలికాపురతమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ మేకల హనుమంతరావు తెలిపారు. ఈవేడుకల్లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ, బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అట్లూరి మధు, టీవీ పుల్లంరాజు, మహేశ్వరం శ్రీధర్ బాబు, పొన్నం వీర వసంతకుమార్, సరిపుడి నాగేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ, వేజెండ్ల రవీంద్రబాబు, ఆలస్యం నారాయణరావు, గుర్రాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురనగర్ శ్రీనగర్ కాలనీలో గల సమర్థ సద్గురు సాయినాథ్ మందిర వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చండీహోమం నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, కార్పొరేటర్లు వలరాజు, కర్నాటికృష్ణ, నాగండ్లకోటి, టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షకసేవా సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, పగడాల నాగరాజు తదితరులు పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీచేశారు.

ఆర్యవైశ్యులకు సరైన గుర్తింపు ఇవ్వాలి

నేలకొండపల్లి: రాజకీయంగా ఆర్యవైశ్యులకు సరైన గుర్తింపు లేక ఎలాంటి అవకాశాలు రావడం లేదని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో గాంధీ, పొట్టిశ్రీరాముల విగ్రహాలను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్‌లోనూ ఆర్యవైశ్యలకు గుర్తింపులేకుండా పోయిందని విమర్శించారు. పేద మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, భద్రయ్య, వంగవీటి నాగేశ్వరరావు, రాయపూడి నవీన్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, వేణు, నరేష్, బ్రహ్మం, శేఖర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల దిష్టిబొమ్మలు దహనం



ఖమ్మంలో దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న నాయకులు

కామేపల్లి/ఖమ్మంవన్‌టౌన్: అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిలు దళిత నాయకులు, ప్రజాప్రతినిధుల పట్ల అమర్యాదగా, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం కామేపల్లి మండల కేంద్రంలో, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఎమ్మెల్యేలా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌ను ఏకవచనంతో మాట్లాడి సభ మర్యాదను మంటగిలారని మండిపడ్డారు. దళితులంటే బీఆర్‌ఎస్ నాయకులకు ఎప్పుడూ చులకన భావమేనని, కిందిస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఇదే తంతు నడుస్తుందన్నారు. కామేపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, సుందరం, బాషాసింగ్, రాందాస్, సీతారాం, వెంకటనర్సయ్య, భానుప్రతాప్, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ జావీద్, రాష్ట్ర హస్తకళ చైర్మన్ నాయుడు సత్యంలతో పాటు దొబ్బల సౌజన్య, వెంకన్న, లక్ష్మణ్, షేక్ అబ్బాస్ భేగ్, శంకర్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు

'భుజం మీద భూమి' పుస్తకం..



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: కవి, వాగ్గేయ కారుడు, ప్రధానోపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్య రాసిన 'భుజం మీద భూమి'కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవి, రచయిత, విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ హాజరై మాట్లాడగా.. జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు మువ్వా శ్రీనివాసరావు, ఆర్.వీరస్వామి, రవికుమార్, చలపతిరావు, వేలాద్రి, అరుణకుమారి, రంజాన్, రౌతు రవి, మేడగాని శేషగిరి, శ్రీనివాస్, సునంద, దేవయ్య, కృష్ణయ్య, జయరాజు, మణీందర్, అట్లూరి వెంకటరమణ, సైదులు, షఫీ, కొండ్రు బ్రహ్మం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్ పైలాన్..

నేలకొండపల్లి: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్లు వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను వైరా శాసనసభ్యుడు రాందాసు నాయక్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, దొబ్బల సౌజన్యలతో పాటు నారాయణ, అంజిని, నాగరాజు, వేణు, రామారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉస్మానియా'లో ఆంక్షలు ఎత్తివేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: క్యాంపస్ ప్రజాస్వామ్యం లేకుండా రిజిస్టర్ తీసుకుని వచ్చిన అప్రజాస్వామిక, నియంతృత్వ సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం ఖమ్మం సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. క్యాంపస్‌లో నినాదాలు, పోరాటాలు, ధర్నాలు ఉండకూడదని అప్రజాస్వామిక, నియంతృత్వ సర్క్యులర్ రిజిస్టర్ నరేష్ రెడ్డి చేత జారీ చేయించడాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు మణికంఠ, నాయకులు వినోద్, కార్తీక్, మనోజ్ లోకేష్, త్రినాథ్ పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నేలకొండపల్లి: పంటల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి పాల్తీయ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని మంగాపురంతండాలో రైతు మహాసభ విజయవంతం కోసం ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న నేలకొండపల్లిలో జరిగే రైతు సంఘం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భూక్యా రాములు, గుగులోత్ వెంకటేశ్వర్లు, భూక్యా అంజయ్య, భద్రుక్యా సుకో, పాల్తీయ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పేరు మార్పు సరికాదు

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పేరు మార్పు యోచన సరికాదని,ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆర్యవైశ్య సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం నగరంలోని గుట్టలబజార్‌లో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి రామచంద్రరావు అధ్యక్షతన ఆర్యవైశ్య సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా, నగర ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలుగు యూనివర్సిటీకి పెట్టిన పొట్టి శ్రీరాములు పేరును మార్చే యోచన ఆర్యవైశ్య మనోభావాలను దెబ్బతీసేలా ఉందని తెలిపారు. ప్రభుత్వ యోజనను విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు చవిచూడక తప్పదని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్య



మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

వైశ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు గుమ్మడివల్లి శ్రీనివాసరావు, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, గోళ్ల రాధాకృష్ణ, చిన్న కృష్ణారావు, దేవకీ వాసుదేవరావు, సన్నే ఉదయ్‌ప్రతాప్, కొప్పు నరేష్, కొత్త వెంకటేశ్వరరావు, కొణతం లక్ష్మీనారాయణ, పాల్వాయి సీతయ్య, విన్నమూరి సుబ్బారావు, మిట్టపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.